సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



నిధులున్నా.. నిర్లక్ష్యం!
గద్దెరాగిడి శ్రీనివాసగార్డెన్స్ నుంచి క్యాతనపల్లి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎనిమిది నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. 8లో▸



బస్టాండ్ లేక తిప్పలు
కెరమెరిలో బస్టాండ్ లేక ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.8 /24.6

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు తగ్గుతాయి. వేడి, ఉక్కపోత తగ్గుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కార్యకర్తలే బీజేపీకి మూల స్తంభాలు'



జైనూర్‌లో మాట్లాడుతున్న నగేశ్

జైనూర్: బీజేపీకి కార్యకర్తలే మూల స్తంభాలని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలే తనను గెలిపిస్తాయన్నారు. బీజేపీ గత పదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోట్నక విజయ్‌కుమార్, నాయకులు ఆత్రం భీంరావు, కోట్నక దౌలత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

లింగాపూర్: నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలోని జగదాంబ ఆలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ గల్లీలో లేదని, ఢిల్లీలోనూ లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, రమేశ్, మంగులాల్, సురేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన 'పురాణం'



విశ్వప్రసాదరావుతో పురాణం సతీశ్

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ గురువారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ప్రకటించారు. పార్టీ నాయకులు బాలేశ్వర్ గౌడ్, చరణ్ తదితరులు ఉన్నారు.


'రాజ్యాంగాన్ని మార్చే కుట్ర'



పూలే చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందని డీవైఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి కార్తీక్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. కార్తీక్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీపై పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ నెల 5 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా పూలే, అంబేద్కర్ జనజాతర సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహనీయుల స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, నాయకులు పురుషోత్తం, శ్రీకాంత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పూలేకు కోవ లక్ష్మి నివాళి



నివాళులర్పిస్తున్న కేటీఆర్, కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా రంజాన్





జిల్లా కేంద్రంలో చిన్నారుల ఆత్మీయ ఆలింగనం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. నెలరోజులుగా ఉపవాస దీక్షలు చేసిన వారు గురువారం ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. మతపెద్దలు ఖురాన్ సందేశం చదివి వినిపించారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ఎంపీపీ మల్లికార్జున్‌తోపాటు పలువురు నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ సురేశ్‌కుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సోదర భావం కలిగి సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అలాగే కాగజ్‌నగర్ పట్టణంలోని కదీం ఈద్గాలో ఉదయం 9.30 గంటల నుంచే సామూహిక ప్రార్థనలు(నమాజ్) నిర్వహించారు. ప్రపంచ శాంతితోపాటు దేశంలోని అన్నిప్రాంతాల్లో శాంతి సద్భావాలు ఉండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మౌలానా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు(దువా) చేశారు. చింతగూడలోని ఈద్గాలో ముఫ్తి నవీద్‌ఉర్ రెహమాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేపట్టారు. పట్టణంలోని కౌసర్‌మసీద్, చిన్న మసీద్, నూరాని మసీద్, మెరాజ్ మసీద్, నాసర్ మసీద్‌ల్లోనూ ఈద్ నమాజ్ చేశారు. కదీం ఈద్గా వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, చింతగూడ ఈద్గా వద్ద ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ శంకరయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాగజ్‌నగర్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప



కాగజ్‌నగర్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద..

మళ్లీ పులి కదలికలు



- చాలా రోజుల తర్వాత బెబ్బులి అలజడి
- బెజ్జూర్ రేంజ్‌లోని అటవీప్రాంతంలో పశువుల మందపై దాడి
- అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- గ్రామీణ ప్రజలకు అవగాహన



బెజ్జూర్ రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడిలో హతమైన లేగదూడ కళేబరం(ఫైల్)

పెంచికల్‌పేట్(సిర్పూర్): కాగజ్‌నగర్ డివిజన్‌లో కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న పెద్దపులుల కదలికలు మళ్లీ ప్రారంభమయ్యాయి. రెండు పులులు మృత్యువాత పడిన తర్వాత చాలా రోజులకు అటవీ ప్రాంతాల్లో పులి అలజడి కనిపిస్తోంది. బెజ్జూర్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి ఇటీవల పశువుల మందపై దాడి చేసింది. బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లె శంకర్ అనే రైతు లేగదూడ ఈ నెల 6న ఉదయం సిద్దాపూర్ అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లి పులి దాడిలో హతమైంది. అటవీ ప్రాంతంలో ఆదివారం లేగదూడ కళేబరాన్ని గుర్తించారు. ఎఫ్‌బీవో వెంకటేశ్ ఘటనా స్థలాన్ని సందర్శించి రేంజ్ పరిధిలో పులి కదలికలను నిర్ధారించారు.

మళ్లీ ఇప్పుడే..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అడవుల్లో పెద్దపులుల సంచారం సర్వ సాధారణం. ఇక్కడ తరచూ పులులు పశువులపై దాడులకు చేస్తూ.. ప్రజలకు సైతం తారసపడతాయి. 2020 నవంబరు 11న దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విఘ్నేశ్, అదే నెల 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల పులి దాడిలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటనల తర్వాత అటవీ సమీప ప్రాంతాల్లో ప్రజలకు, వన్యప్రాణులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలోనే కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీప్రాంతంలో జనవరి 6న కే15, రెండు రోజులకు 8న ఎస్9 అనే పెద్దపులులు మృత్యువాత పడటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వీటిపై విష ప్రయోగం జరిగిందని అటవీశాఖ అధికారుల విచారణలో తేలింది. పశువుల కాపరులే పులి దాడిలో ఎద్దు చనిపోయిందనే కోపంలో విష ప్రయోగం చేసినట్లు నిర్ధారణ అయింది. అప్పటి నుంచి అంటే జనవరి తర్వాత నుంచి మళ్లీ కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో పులుల జాడ కనిపించలేదు. దీంతో పులుల రక్షణపై పలు అనుమానాలు తలెత్తాయి. అటవీశాఖ అధికారుల తీరుపైనా విమర్శలు వచ్చాయి. మళ్లీ నెలల విరామం తర్వాత ఓ పెద్ద పులి పశువుల మందపై దాడి చేసింది.

వన్యప్రాణులకు నిలయం

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతం వన్యప్రాణుల జీవనానికి నిలయంగా మారింది. సిర్పూర్(టి), కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, బెజ్జూర్, రేంజ్‌లు పులులకు కారిడార్‌గా ఉన్నాయి. ఏటా పెద్దపులులు మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఇంద్రావతి అభయారణ్యాలను దాటుకుని ప్రాణహిత, పెన్‌గంగ నదుల మీదుగా జిల్లాలోకి వస్తున్నాయి. దట్టమైన అడవులు నిరంతరం నీటి లభ్యత వాటిని ఆకర్షిస్తున్నాయి. అధిక సంఖ్యలో శాఖాహార జంతువులు ఉండి.. వాటికి ఆహారం పుష్కలంగా లభిస్తుండటంతో ఇక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకుని సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. వేసవిలో మాత్రం శాఖాహార జంతువుల వేట కష్టంగా మారిన సమయంలో అడవులను వదిలి సమీప అటవీ ప్రాంతాల్లోని పశువుల మందలపై దాడులకు దిగుతుంటాయి. పెద్దపులుల కదలికలను గుర్తించేందుకు శిక్షణ పొందిన ఎనిమల్ ట్రాకర్స్ పని చేస్తుంటారు. వీరు వన్యప్రాణుల కదలికలను గుర్తించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. ఇటీవల మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏనుగు జిల్లాలోని చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఎనిమల్ ట్రాకర్స్ ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలం కావడంతో ఏనుగు దాడిలో బూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్, కొండపల్లి గ్రామానికి చెందిన కారు పోశన్న అనే ఇద్దరు రైతులు మృతి చెందారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

వన్యప్రాణుల సంచారంపై గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. అటవీ ప్రాంతాల్లో పెద్దపులులతో పాటు అనేక రకాల వన్యప్రాణులు జీవనం సాగిస్తున్నాయి. వాటి ఆవాసానికి ఇబ్బంది కలగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలి. వన్యప్రాణుల సంచారం ఉంటే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి. అనుమతి లేకుండా అడవుల్లో తిరిగినా.. వన్యప్రాణులకు హాని తలపెట్టినా కేసు నమోదు చేస్తాం.

– జి.సుధాకర్, ఎఫ్‌ఆర్‌వో, పెంచికల్‌పేట్

తెగల్లో చీలిక!



ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సమావేశమైన గోండేతర తెగలవారు

- గొంతెత్తిన ఆదివాసీల్లోని గోండేతరులు
- పదవుల్లో ప్రాతినిధ్యం లేదని ఆరోపణ
- రాజకీయ పార్టీల ధోరణిపై వ్యతిరేకత
- 15వ తేదీలోపు స్పష్టతకు అల్టిమేటం
- లేనిపక్షంలో బరిలో ఉంటామని స్పష్టం
- చర్చనీయాంశమైన ఆదివాసీల్లోని చీలిక

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీ తెగల్లో చీలిక కనిపిస్తోంది. రాజకీయంగా ఎస్టీ రిజర్వ్‌డ్ పదవుల్లో పోటీ చేసే విషయంలో రాజకీయ పార్టీలు తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని గోండేతరులు ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మారాలంటున్నారు. గోండు తెగకు చెందిన ముగ్గురు నేతలను మూడు పార్టీలు ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించాయని విమర్శిస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి రిజర్వ్‌డ్ పదవుల కేటాయింపుపై ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్‌లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర ముఖ్యమైన పదవుల్లో ఒకటి గోండులకు ఇస్తే, మరొకటి గోండేతర తెగలవారికి ఇచ్చేలా పార్టీలు చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఈ నెల 15లోపు స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో తమలోంచి ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దించుతామని హెచ్చరిస్తున్నారు.

గొంతెత్తిన తెగలు..

ఆదివాసీల్లో గోండు, కొలాం, నాయక్‌పోడ్, ఆంధ్, పర్ధాన్, మన్నేవార్, తోటి, గుత్తికోయ, చెంచు మొదలైన తొమ్మిది తెగలుండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి ఏడు తెగల ఆదివాసీలు జీవిస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వ్‌డ్ కాగా, ఇటీవల ప్రధాన పార్టీలు గోండు సామాజిక వర్గాలవారినే అభ్యర్థులుగా ప్రకటించాయని గోండేతరులు ఆరోపిస్తున్నారు. ఆదివాసీల్లో అధిక జనాభా గోండు వారిదే కాగా, మిగతా తెగలందరి జనాభా కలిపితే గోండుల కంటే అధికంగా ఉందని వారు పేర్కొంటున్నారు. అయితే రాజకీయ పదవుల కేటాయింపులో తమ తెగలను కూడా గుర్తించాలని కోరుతున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పోడ్, ఆంధ్, మన్నేవార్ తెగలవారు సమావేశమయ్యారు. ఈ విషయంలో ఇదివరకు నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సమావేశాలు పూర్తి చేశారు.

ఎటు దారితీస్తుందో..?

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్నారు. డిమాండ్ సాధనకు ఆదివాసీల్లోని అన్ని తెగలవారు పోరాడుతున్నారు. ప్రస్తుతం రాజకీయ పదవుల్లో తమను అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదని గోండేతర తెగలవారు గొంతు కలిపారు. ఈ చీలిక వారి ప్రధాన ఉద్దేశాన్ని దెబ్బతీస్తుందా.. అనే చర్చ కూడా సాగుతోంది. ఏదేమైనా ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ప్రస్తుతం ఈ అంశం చర్చనీయంగా మారింది. ఒక పక్క ఈ స్థానంలో ప్రధాన పార్టీల నుంచి తమకు అవకాశం ఇవ్వలేదని లంబాడాలు ఇప్పటికే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీల్లోని లంబాడా నేతలు ఏకతాటిపైకి వచ్చి ఈ విషయంపై చర్చించాలని బంజారా సమాజం పిలుపునిచ్చింది. ఇప్పటికే ఈ విషయంలో పలుసార్లు ఉమ్మడి జిల్లాలో వారు సమావేశాలు కూడా నిర్వహించారు. తమ నుంచి ఒక నేతను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించాలని యోచిస్తున్నారు. మరో పక్క ఆదివాసీ తెగల్లో చీలిక రావడం, తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతామని చెప్తుండటం ప్రాధాన్యత కలిగిస్తోంది. దీంట్లో పర్ధాన్ సమాజం నుంచి దుర్వ నగేశ్, పెందూర్ సుధాకర్, నాయక్‌పోడ్ తెగ నుంచి సట్ల అశోక్‌లో ఎవరినైనా పోటీ చేయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

'మొట్లగూడ నీటి కష్టాలు తీరుస్తాం'



మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న మహిళ



చేతిపంపును పరిశీలిస్తున్న అధికారులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం మొట్లగూడలోని ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తామని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. మొట్లగూడ గ్రామస్తుల నీటి ఇబ్బందులపై గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మొట్లగూడలో నీటి గోస' కథనానికి ఎంపీడీవో రాజేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్ స్పందించి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని చేతిపంపులను పరిశీలించారు. మరో రెండు, మూడు పైపులు వేసి వాటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అలాగే స్థానికంగా నాలుగు సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటుకు కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటుతో నీటి సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని 40వేల లీటర్ల ట్యాంకు ఉన్నా సరిపోవడం లేదని, మరో 10వేల లీటర్ల నీటిని సరఫరా చేస్తామని మిషన్ భగీరథ ఏఈ గోపి తెలిపారు. ట్యాంకు వద్ద నీటి తొట్టిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీళ్లు నింపినట్లు ఆయన తెలిపారు.

సాక్షి స్పందన

లీకేజీలకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వరలక్ష్మి

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని ఎనోలి కొలాంగూడలో తాగునీటి కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. 'తాగునీటికి కష్టాలు', 'ట్యాంకు నుంచి మోసుకెళ్లాల్సిందే' అనే కథనాలపై అధికారులు స్పందించి బుధవారం నుంచి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టారు. నల్లాలకు కొత్త ట్యాప్‌లు బిగించి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గురువారం ఎంపీడీవో వీవీ వరలక్ష్మి గ్రామాన్ని సందర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్, పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్(సిర్పూర్): మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో బడుగు బలహీన వర్గాలు ఉన్నతంగా ఎదగాలని, సామాజిక, ఆర్థిక అసమానతలు లేకుండా అందరూ చదువుకొని జ్ఞానవంతులు కావాలని జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. యువత పూలే చూపిన బాటలో పయనించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన ముస్లింలను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముంజంపల్లి గ్రామానికి చెందిన డబ్బుల జనార్దన్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా.. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నన్న, ఖాజా షమిఉద్దీన్, సామల రాజన్న, చిప్పకుర్తి దేవాజీ, తెలి రాజేష్, అడ్డూరి రాజేష్, ఆనంద్‌రావు, షణ్ముఖ చారి, రమేశ్, శ్రీశైలం, ఆబిద్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నల్లాకు ఆన్ ఆఫ్ బిగింపు



నల్లాకు ఆన్‌ఆఫ్ బిగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మిషన్ భగీరథ నల్లాకు ఆన్ ఆఫ్ లేక నీళ్లు వృథాగా పోయాయి. దీనిపై గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శిరీష స్పందించి తమ సిబ్బందితో నల్లాకు ఆన్ ఆఫ్ బిగించి నీటి వృథాను అరికట్టారు.

పల్లె వీధుల్లో ఉల్లి రైతు



నెన్నెలలో ఉల్లిగడ్డలు విక్రయిస్తున్న రైతు

నెన్నెల: ఉల్లి రైతుకు కష్టాలు వెంటాడుతున్నాయి. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాలు తప్పవేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి క్వింటాల్‌కు రూ.1200 నుంచి రూ.1500 కూడా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో కొంత మేర నష్టాలు తప్పించుకోవడానికి పొలం నుంచి నేరుగా ఎడ్లబండ్లు, బొలేరా, ఆటో ట్రాలీలలో పల్లెల్లోకి తీసుకొచ్చి వీధుల్లో తిరుగుతూ రూ.2000లకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్నామని కన్నెపల్లి, భీమిని మండల రైతులు ఆవేదనతో చెప్పారు. ఖర్చు భారం పెరిగిందని, పట్టణ మార్కెట్‌లలో ధర తక్కువగా ఉందని నేరుగా అమ్ముకుంటే నాలుగు పైసలు వస్తాయని నష్టాల్లో నుంచి బయట పడుతామని పల్లెల్లో తిరుగుతూ విక్రయిస్తున్నామని ఉల్లి రైతులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన తమ్మరాశి భూమన్న బుధవారం ద్విచక్ర వాహనంపై లోకేశ్వరం మండలం హవర్గా గ్రామానికి వెళ్లి వస్తుండగా అర్లి(కే)సమీపంలో కంకెట గ్రామానికి చెందిన సుధీర్ కుమార్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. భూమన్న సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం!

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.22 కోట్ల నిధులు. అవి కూడా అధికారికంగా మంజూరైనవే. మంజూరై ఎనిమిది నెలలు కావస్తోంది. అయితే ఆ నిధులతో చేపట్టే రోడ్డు వెడల్పు పనుల్లోనే అంతులేని నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కేవలం సమన్వయ లోపం, ఉద్దేశ పూర్వక నిర్లిప్తతే పనుల జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. కొంత మిషనరీ సమస్య ఉందంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు తటపటాయిస్తుంటే మరికొన్ని అనుమతులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ బుకాయిస్తున్న వైనమిది. ఎటొచ్చి సామాన్య ప్రజలు మూడు కిలోమీటర్ల దూరానికే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. ఎనిమిది నెలలుగా నత్తనడకన సాగుతున్న రోడ్డు వెడల్పు నిర్మాణ పనులపై ప్రత్యేక కథనం.

- ఎనిమిది నెలలుగా ఎటూ తెగని రోడ్డు వెడల్పు పనులు
- అధికారులను అడిగితే కాంట్రాక్టర్‌పై నెపం
- మెటల్ అనుమతులు లేవంటూ కాంట్రాక్టర్ బుకాయింపు
- అస్తవ్యస్త పనులతో ప్రజలకు తప్పని తిప్పలు



అసంపూర్తి పనులతో అధ్వానంగా ఉన్న హైవేరోడ్డు

రామకృష్ణాపూర్: మంచిర్యాల–నాగ్‌పూర్ హైవే మార్గంలోని గద్దెరాగిడి శ్రీనివాసగార్డెన్స్ నుండి క్యాతనపల్లి వరకు రోడ్డు వెడల్పు పనులు సాగుతున్నాయి. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఈ పనులు జరగాల్సి ఉంది. రోడ్డు వెడల్పు పనులతో పాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.22 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రోడ్డు వెడల్పు పనులు మొదలుపెట్టినా నేటికీ అతీగతీ లేకుండా పోయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్దపెద్ద చెట్లు తీసివేసి ఒకవైపు కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ పనులు వేగిరంగా చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా అక్కడక్కడ గుంతలు తీయడం, పోసిన ఫ్లైయాస్‌పై నీరు సక్రమంగా చల్లకపోవడంతో దుమ్ముధూళి లేచి వాహనాలు వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. యుద్ధప్రాతిపదికన పనులు మొదలుపెట్టినట్లే పెట్టి పత్తాలేకుండా పోయారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కబుర్లతోనే కాలం వెల్లదీత...

మంచిర్యాల–నాగ్‌పూర్ మెయిన్ రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తుంటే అధికారుల పర్యవేక్షణ లోపం...కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం నిధులు అందుబాటులోనే ఉన్నాయి. రోడ్డు మధ్యలో అక్కడక్కడ కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది. విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే కాంట్రాక్టర్, వివిధ శాఖల అధికారులు మధ్య సమన్వయలోపం కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు, కాంట్రాక్టర్ దోబూచులాట...

రోడ్డు వెడల్పు పనుల విషయంలో ఆయా శాఖల అధికారులు ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ దోబూచులాడుతున్నారు. కొంత మిషనరీలేని సమస్య కారణంగా ఆలస్యం అవుతోందని అధికారులు చెబుతుంటే లేదులేదు మరికొన్ని అనుమతులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ దాటవేస్తుండటం గమనార్హం. ముఖ్యంగా మెటల్ వేసేందుకు అనుమతులు ఇవ్వలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఏదెలా ఉన్నా వీరి నిర్వాకం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఇరుకైన రోడ్డు, అసంపూర్తి పనులతో రోడ్డుపై వెళ్లటానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వీడి రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తిచేయించేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

వేసవిలో పశుపోషణపై శ్రద్ధ వహించాలి



ఎండలో మేస్తున్న పశువులు

- కత్తెరశాల పశువైద్యాధికారి శ్రీనివాస్



శ్రీనివాస్, వెటర్నరీ వైద్యుడు, కత్తెరసాల

చెన్నూర్‌రూరల్: వేసవిలో మూగజీవాల పోషణపై సరైన శ్రద్ధ వహించాలని కత్తెరసాల పశు వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. వేసవిలో పశుపోషణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాడి పశువులకు వేసవిలో మేత, దాణాను సరిపడా అందించాలి. పచ్చిమేత దొరకని సమయంలో ఎండుమేతతో పాటు దాణా ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన చల్లని నీరు లభించేలా చూడాలి. మేత, నీరు సరిపడా ఉంటే పాడి పశువులు వేసవిలో కూడా పాలు బాగా ఇస్తాయి. ఎదకొచ్చి చూలు కడుతాయి. వేసవిలో పాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి ఇంకా పెరిగే అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలోనే పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటే పాడి పరిశ్రమకు లాభదాయకం. ఇందుకు పశువుల షెడ్లు (కొట్టాల) వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే షెడ్లు (కొట్టాల)పై గడ్డిని కప్పి ఉంచాలి. అలాగే షెడ్లు(కొట్టాల) చుట్టూ తడికెలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపైన కూడా మధ్యాహ్నం రెండు, మూడుసార్లు నీళ్లుచల్లితే మంచిది. గేదెలను మధ్యాహ్నం పూట చెరువులకు పంపి కొంతసేపు అందులో ఉండనివ్వాలి. కొట్టాల చుట్టూ పెద్ద చెట్లు ఉంటే లోపల చల్లగా ఉంటుంది. ఈ పద్ధతులు పాటిస్తే పాలు ఎక్కువగా ఉండటమే కాకుండా పశువులు ఎదకొచ్చి చూడి కడుతాయి. అలా అవి ఏడాది పొడవునా పాలిచ్చే అవకాశం ఉంటుంది. సాయంత్రం పూట పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడిగితే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవిలో గొర్రెలు, మేకలను జత కలిపి చూడి కట్టించాలి. మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరు చేయాలి. పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి. అమ్మతల్లి (బొబ్బ, మశూచి) టీకాలను, చిటుక రోగం టీకాలను పిల్లలకు తప్పకుండా వేయించాలి. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి గొర్రెలు, మేకలకు, ముఖ్యంగా పిల్లలకు వడగాలులు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో బయట మేపక పోవడం మంచిది. బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి. పశు వైద్యుని సలహా మేరకు నట్టల నివారణ మందులను వినియోగించాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో పశువులు, జీవాలను కాపాడుకోవచ్చు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

పాతమంచిర్యాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసి అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేసిన సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పూలే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పూలే చరిత్రను భావితరాలు స్మరించుకునే విధంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని, భారతరత్న బిరుదు ఇచ్చి గౌరవించాలన్నారు. జిల్లా కేంద్రంలో పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేశ్, మహిళా అధ్యక్షురాలు ఆకుతోట పద్మాదేవి, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న తెలంగాణ బీసీ జాగృతి నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ

జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో బీఎస్పీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కట్టా పవన్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి బోస్, ప్రధాన కార్యదర్శి పార్నంది రమేశ్, జిల్లా కార్యదర్శి గుడికందుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

హరిత లక్ష్యం...

- కార్యాచరణకు సమాయత్తం
- ఇప్పటి వరకు 9 విడతలు పూర్తి
- ఈసారి పదో విడత ..
- నాటేది 39.49 లక్షల మొక్కలు
- మొత్తం నర్సరీలు 566

కోటపల్లి(చెన్నూర్): జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచడంతో పాటు పల్లెల్లో పచ్చందాల అభివృద్ధికి ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా హరితహారం పేరిట మొక్కలునాటే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందుకు వివిధ రకాల మొక్కలను గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. ప్రస్తుతం పదో విడతలో నిర్దేశించుకున్న లక్ష్యాలతో పంచాయతీ స్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేస్తూ మొక్కలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇందుకు నర్సరీల నిర్వహణపై మొదటల్లోనే శిక్షణ ఇచ్చారు. దీనికి సంబంధించి సాక్షి కథనం..

వర్షాలు ఆరంభంకాగానే శ్రీకారం...

ఈ ఏడాదిలో వర్షాలు కురిసిన వెంటనే హరితహారం మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పక్కన నాటే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని 18 మండలాలు 318 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 39.49 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించారు. పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీలను ఏర్పాటు చేస్తూ ఆయా గ్రామాల్లోని ప్రజల ఆసక్తిని గుర్తించి మొక్కల రకాలను ఎంపిక చేశారు. కొన్ని రకాల మొక్కలను ఇంటి అవరణలో పెంచుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఏటా మొక్కలు మిగిలిపోతున్నాయని అధికారులు గుర్తించారు. ఒక్కో పంచాయతీలో కొత్తగా ఐదువేలతో పాటు ఆయా గ్రామాల్లో గతేడాది మిగిలిన మొక్కలను కలిపి లక్ష్యంగా నిర్ణయించారు.

నవంబర్‌లో ఎర్రమట్టి, పశువుల ఎరువులతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టగా ప్రస్తుతం పచ్చందాలతో నర్సరీలు ఆకట్టుకుంటున్నాయి. హరితహారం అమలు తీరుపై జిల్లాస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలిస్తున్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఎరువుల తయారీతో కూలీలకు ఉపాధి

గ్రామాల్లో నర్సరీల నిర్వహణతో కూలీలకు నిత్యం ఉపాధి లభిస్తోంది. ఎర్రమట్టి, పశువుల పేడ, రసాయనిక ఎరువును మిశ్రమంగా తయారు చేసే సమయం నుంచి కూలీలు, వనసేవకులదే ప్రధాన పాత్రగా ఉంటోంది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మట్టి తీసుకువచ్చిన తర్వాత కూలీలతో సేంద్రియ, రసాయన ఎరువులతో మిశ్రమాన్ని తయారు చేయించడం, సంచుల్లో మట్టిని నింపడం, వరుసల్లో పేర్చడం విత్తనాలు వేయడం, అంటు కొమ్మల సేకరణ, నీరు పట్టడం వంటి అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. ఒక్కో నర్సరీలో ఇద్దరు ముగ్గురు చొప్పున పనిచేస్తున్నారు.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే

నర్సరీల నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూస్తున్నాయి. ఎండలు ముదరడంతో మొక్కలపై కొన్నిచోట్ల చలువ పందిళ్లు వేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నాం. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల ఆవరణ, రోడ్డు పక్కల నాటే మొక్కలతో పాటు ఇంటింటికీ సరఫరా చేసేందుకు అనుకూలమైన పండ్లు, పూల మొక్కలను కూడా పెంచుతున్నాం.

– అక్తర్, ఎంపీవో, కోటపల్లి

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య



నవ్య (ఫైల్)

జన్నారం: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మృత్యుంజయ సర్కార్, మృతురాలి తల్లి గంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలం కరత్వాడ గ్రామానికి చెందిన ఈదుల్ల గంగమ్మ, అడెల్లు దంపతుల కుమార్తె నవ్య (28)కు జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన గద్దల శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయంలో ఎస్‌వోగా పనిచేస్తున్న నవ్య కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయంకాలేదు. ఈ నెల 10న కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా జన్నారం, అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా చేస్తున్న తహసీల్దార్

అటవీ ఫలాలపై ఆసక్తి

- గ్రామాల్లో లభ్యమవుతున్న తునికి, పాల పండ్లు

నెన్నెల: వేసవి వచ్చిందంటే చాలు పలు రకాల అటవీ పండ్లు దర్శనమిస్తుంటాయి. అడవిలో సహజంగా దొరికే అటవీ ఉత్పత్తులను గిరిజనులు గ్రామాల్లో విక్రయించి కొత్త రుచిని చూపిస్తుంటారు. సీజన్‌లో లభ్యమయ్యే అటవీ ఫలాలను ఏటా తింటే ఆరోగ్యానికి మంచిదని పల్లె ప్రజల నమ్మకం. అందుకే ప్రతి ఒక్కరూ అటవీ ఫలాలను తీసుకోవడంపై ఆసక్తి చూపుతుంటారు. పాల పండ్లు, తునికి పండ్లు, మొర్రి పండ్లు తదితర వాటిని గిరిజనులు అడవి నుంచి సేకరించి గ్రామాల్లోకి తీసుకువస్తుంటారు. దీంతో గిరిజనులకు ఈ వేసవి ఉపాధి ఇచ్చినట్లు అవుతుంది. ఏడాదికి ఒకసారి మాత్రమే వేసవిలో కనిపించే ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. అరుదుగా కనిపిస్తున్న పాలపండ్లకు ఎక్కువ ధర ఉన్నప్పటికీ, కొనడానికి ప్రజలు వెనుకాడటం లేదు. ఈ రెండు నెలలు గిరిజనులు అడవిలో సంచరించి వీటిని సేకరిస్తుంటారు. దీంతో రెండు నెలల పాటు గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. ఇదే సీజన్‌లో ఇప్పపూల సేకరణ సైతం చేస్తూ ఉంటారు.



పాలపండ్లు విక్రయిస్తున్న మహిళ

వైద్యం అందేదెలా..!

- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుల కొరత
- అత్యవసర విభాగంలో తప్పని తిప్పలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతున్న ఈ ఆస్పత్రిలో అన్ని విభాగాల్లోనూ వైద్యులు ఉన్నా అత్యవసర విభాగం(క్యాజువాలిటీ)లో వైద్యుల కొరతతో సమయానికి వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఓపీ విభాగంలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అత్యవసర వైద్యం అందే క్యాజువాలిటీ విభాగంలో వైద్యులు పది మందికి గాను ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వారు సెలవు పెట్టినప్పుడు ఇబ్బందిగా మారుతోంది. 24 గంటలు ఈ విభాగంలో వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉన్నా ముగ్గురు మాత్రమే ఉండడం వల్ల, ఏ ఒక్కరు సెలవులో వెళ్లినా మిగతా ఇద్దరితో నిర్వహణ, ఆసుపత్రి పర్యవేక్షణ ఇబ్బందిగా మారుతోంది. వైద్యులు గైర్హాజరైతే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డినే ఆ విభాగంలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.



క్యాజువాలిటీ విధుల్లో హరీశ్‌చంద్రరెడ్డి (ఫైల్)

ముఖ్యమైన విభాగంలోనే కొరత

మంచిర్యాల జిల్లా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ప్రజలు అత్యవసరమైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వస్తుంటారు. క్యాజువాలిటీ విభాగం 24 గంటలు పనిచేస్తుండగా ముగ్గురు వైద్యులే పనిచేస్తున్నారు. ఇందులో ఒకరు కొంతకాలంగా మెటర్నిటీ సెలవులో వెళ్లగా, ఇద్దరు పనిచేశారు. ఈ నెల 10న మెటర్నిటీ సెలవులో వెళ్లిన వైద్యురాలు రావడంతో ఇప్పుడు వైద్యుల సంఖ్య ముగ్గురుకు చేరింది. ఇందులో ఎవరు సెలవు పెట్టినా మిగతా వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఇబ్బందిగా మారుతోంది. గతంలో కొత్తగా ఆరుగురిని ఎంపిక చేయగా, వారికి ఇతర చోట్ల ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రస్తుతం ఉన్న ముగ్గురు వైద్యులు పనిచేస్తుండగా, రాత్రి సమయంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా పనిచేస్తున్న సీనియర్ రెసిడెంట్లకు(ఎస్‌ఆర్) విధులు కేటాయిస్తున్నారు. ప్రతీరోజు రాత్రి సమయాల్లో విధులు కేటాయించడంపై కొందరు ఎస్‌ఆర్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తుస్తున్నారు. రెగ్యులర్‌గా వైద్యులను నియమించకపోవడంతో క్యాజువాలిటీ విభాగానికి ఇబ్బంది తప్పడం లేదు.

వైద్యులను నియమించాలని కోరాం

క్యాజువాలిటీ విభాగంలో పది మంది వైద్యులకు గాను ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. 24 గంటల వైద్య సేవలు అందించడం కష్టమవుతోంది. సెలవులు, ఆదివారాలతోపాటు ఆయా వైద్యులు సెలవులో వెళ్లినప్పుడు రోగులకు వైద్యం అందించడంలో జాప్యం రాకుండా మేము కూడా విధులు నిర్వర్తిస్తున్నాం. పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని కోరాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రతీరోజు 50కి పైగా బాధితులు

క్యాజువాలిటీ విభాగానికి ప్రమాదవశాత్తు గాయపడిన, ఆత్మహత్యాయత్నం, ఇతరత్రా అత్యవసర వైద్యం కోసం ప్రతీరోజు 50 నుంచి 60 మందికి పైగా బాధితులు వస్తుంటారు. వైద్యుల కొరతతో సరైన సమయంలో వైద్యం అందక రెఫర్ చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కరీంనగర్, వరంగల్‌కు రెఫర్ చేసినప్పుడు, ప్రైవేటు అంబులెన్సుల డ్రైవర్లు బాధితులకు మాయమాటలు చెప్పి కమీషన్లు ఇచ్చే ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వైద్యులను నియమిస్తే, పూర్తిస్థాయి వైద్యం అందే అవకాశం ఉంది.

కత్తితో దాడి..ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో పండుగ పూట కత్తులతో యువకులు ఘర్షణకు దిగడం కలకలం రేపింది. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరు యువకుల మధ్య వ్యాపార డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని కోలిపూర పాఠశాల సమీపంలో ఐదుగురు యువకుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. కోలిపూరకు చెందిన అన్నదమ్ములు సయ్యద్ ముజాయిద్, సయ్యద్ షాహిద్ అక్కడి నుంచి టీ తాగేందుకు ఓల్డ్ బస్టాండ్‌కు వచ్చారు. గొడవను మదిలో పెట్టుకున్న మరో యువకుడు ఫజ్లు వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఆ అన్నదమ్ముల వద్దకు చేరుకుని మరోసారి వారితో గొడవకు దిగాడు. వెంట తెచ్చుకున్న కత్తితో వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ముజాయిద్‌కు కడుపు భాగం, చెయ్యికి గాయాలయ్యాయి. అడ్డువచ్చిన తమ్ముడికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ముజాయిద్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ రిమ్స్‌కు వెళ్లి వివరాలు సేకరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బేల: మండలంలోని సాంగి(జి) నుంచి ఆదిలాబాద్ వైపు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంగ్వి(జి) గ్రామానికి చెందిన పొచ్చిరాం బుధవారం సాయంత్రం 7 కిలోల గంజాయి తీసుకెళ్తుండగా ముందస్తు సమాచారం మేరకు ఎస్సై రాధికతో పాటు సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి నుంచి విత్తనాలు తెచ్చుకుని తన వ్యవసాయ చేనులో గంజాయి సాగు చేస్తున్నాడని విచారణలో గుర్తించామన్నారు. గంజాయి విలువ రూ.1,75,000 వరకు ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.